# కల్పన

అందాలతో, ఆనందాలతో చిందులు వేస్తూన్న ప్రకృతిలో సాఫీగా సాగిపోతున్నది చెవర్లెట్. నిత్యజీవిత తాపత్రయంలో ముడుచుకుపోయిన మనస్సు ఈతీరుబాటులో స్వేచ్ఛగా వికసించి విశాలమైంది. యాంత్రిక జీవితంలో మునిగి బాహ్యసౌందర్యంపట్ల అంధమైపోయిన నేత్రాలు ఈ సెలవు దినాన—కృత్రిమ జగతికి సుదూరాలలో ఈ నిర్మల నిశ్శబ్ద వాతావరణంలో తెరచుకొని తనివితీరా సౌందర్యోపాసన చేస్తూ చెట్టు చేమలపైకి, పర్వత సానువులపైకి పరుగులిడడంతో వాహనపు పరుగు మందగించింది.

ప్రకృతి కాంతను పరవశావస్థలో వదలి భాస్కరుడు వీడ్కోలు తీసుకొంటున్న ప్రశాంత సమయం. అరుణకాంతులలో తరు గిరి శిఖరాగ్రాలు తళతళ లాడ్తున్న అందం నేత్రాలను ఆకర్షించి ఆపుజేయగా కొంతతడవు ఆ అందాలను తనివిదీరా ఆస్వాదించాలని కోరిక కలిగింది. బాట ప్రక్క ఒక చెట్టుక్రింద కారు ఆపి దిగాను.

నాలుగడుగులు నడిచానో లేదో—ఏదో పెద్దశబ్దమై వెనుదిరిగి అటు చూచాను, కారు బానెట్ పై టెన్నిస్ బంతి పడి లేచి అద్దానికి కొట్టుకొని, తిరిగి బానెట్ పై పడి, క్రిందికి దొర్లివచ్చి, నా కాళ్ళముందు పడింది. అదృష్టవశాత్తూ కారు అద్దం ఏమీ పగులలేదు. ఆశ్చర్యపోతూ బంతినితీసి చుట్టూ చూచాను. "ఈ నిర్మానుష్యమైనచోట ఈ బంతి ఎక్కడి నుండి వచ్చిందీ" అని. ఓ పది గజాల దూరంలో చిన్న బంగళా, చుట్టూ ప్రహరీగోడపూల మొక్కలతో ముచ్చటగా వున్నది. ఆ ప్రహరీగేటును తీసుకుని కారువైపే పరుగు పరుగున వస్తూన్న పది పన్నెండేళ్ళ పసిబాలిక నా కనులను కట్టివేసింది. రక్తారుణ వర్ణపు రిబ్బన్‌తో కట్టబడిన ఉంగరాల జుట్టును ఒకచేతితో ఎగదోసుకుంటూ, చిన్నారిపసిడి పాదాలకు బంధాలు పడ్తూన్న ఎర్ర టెర్లిన్ పరికిణీ కుచ్చెళ్ళను మరొక చేతితో పట్టుకుంటూ పరుగు పరుగున వచ్చి కారు దగ్గర నన్నుచూచి నిశ్చేష్ట అయి నిలబడిపోయిన మందార పువ్వులాంటి అందాలబాలను ఆనందంతో తిలకించసాగాను. స్వచ్ఛమైన పాలలో కడిగిన ముత్యంలాగా, అందమైన విరిసీ విరియని కలువ మొగ్గలాగా పసిమిచ్ఛాయతో, ఆకర్షణీయమైన నేత్రాలతో జిజ్ఞాసగా - భయంగా - నా దెస చూచిన అనిర్వచనీయమైన అందమైన చూపు అమాయకమైన చూపు

నా మనస్సును మంచులాగా - మల్లెలాగా మార్దవంగా స్పృశించింది.

"కారుఅద్దం పగలలేదు కదండీ? బంతిఇచ్చేయరూ?" ప్రతిమాల్తున్నట్లు అని చెయ్యి చాచింది.

పసి అమాయకతా, అమృతత్వమూ నింపుకొన్న ఆ బాలికతో ఆ చక్కటి సమయంలో కొద్ది క్షణాలైనా ఆడుకోవాలన్పించింది. "ఊఁహు, ఇవ్వను" నవ్వును దాచుకొంటూ ఆమెను కవ్వించాలని అన్నాను బంతివున్న చేతిని వెనకకు తీసుకుంటూ.

ఆ అందమైన నేత్రాలనిండా దీనత్వం త్రుటిలో నిండుకున్నది, "ఇవ్వరూ? వెళ్ళిపోనా?" జాలిగా అడిగింది నా వెనుకనే అడుగులు వేస్తూ.

"మరైతే కొద్దిసేపు ఇక్కడ కూర్చుని నాతో కబుర్లు చెప్పు" నేను అలా అంటూండగానే "కల్పనా!" అనే మృదుగంభీరస్వరం విన్పించి, ఆ బాలికతోపాటు నేనూ అటు చూచాను. బంగళా అరుగు మీదినుండి ఓ ముప్పై ఏళ్ళ యువతి ఇటేచూస్తూ పిలుస్తున్నది. రూపు రేఖా విలాసాలలో ఆ బాలికవలెనే ఉన్నది. "అమ్మ పిలుస్తున్నది." అంటూనే ఆ అమ్మాయి చేయిచాపింది మళ్ళీ అర్థిస్తున్నట్టు.

చిన్నారి సుకుమార హృదయాన్ని మరి బాధించడం

ఇష్టంలేక బంతిని అందిస్తూ "నీ పేరు కల్పనా ?" అనడిగాను.

"అవును" అంటూనే అమృతం అందుకున్నట్టు ఆ బంతిని అందుకుని ఇంటివేపుగా ఒక్క పరుగు తీసింది. అరుణ భాస్కరుడు మబ్బులమాటున దాగిన పిమ్మట ప్రకృతిలాగా కల్పన అదృశ్యమైన పిమ్మట నా మనస్సు చిన్నబోయింది. కల్పన కనుమరుగయ్యేవరకూ చూచాను అటే. "ఈ ప్రపంచంలో అతి ప్రియమైనవన్నీ అరుదుగానే లభిస్తాయి!" అన్పించింది. అతి అపురూపమైన ఈ స్నిగ్ధ సుకుమార బాలికతో అధికకాలం గడిపే అర్హత వుండొద్దూ?

నాలుగేళ్ళ అనంతరం తిరిగి ఒక ప్రయాణ సందర్భములో అటు ప్రక్కలకు వెళ్ళడం తటస్థించింది. మనస్సులో కల్పనస్మృతి పాలకడలి తరగలాగా తీయగా లాస్యంచేసింది. ఈ నాలుగేళ్ళుగా అందాలు చిందే ఏముగ్ధబాలను చూచినా ఏ అమాయక నేత్రద్వయాన్ని తిలకించినా కమనీయమైన కల్పనరూపం నా కండ్లల్లో కదులాడుతూనే ఉంది. ఆ జ్ఞాపకమే, ప్రస్తుతం అదే ప్రదేశాన్ని జేరుతూండడంవల్ల కావచ్చు - మనస్సును కొంత ఉద్వేగ పరచింది. కొద్దిక్షణాల ముఖ పరిచయ మాత్రానికే మనస్సున ఈ మార్దవానుబంధ ప్రతిష్ఠ ఏమిటో నాకే అర్థంగాకున్నది. నాలో నేనే నవ్వుకుంటూ

జాగ్రత్తగా గతంలో చూచిన ఆ బంగళా పరిసరాలను గుర్తుకు తెచ్చుకుంటూ కిటికీలోనుంచి బయటకు దృష్టి సారించాను—కల్పన దర్శన భాగ్యాపేక్షతో. ఇదివరలో మాదిరిగా కారులోనే వచ్చి వుంటే పనిమాలా ఆపి ఒక్కసారి బంగళా లోనికి వెళ్ళి కల్పనను చూచి, మాట్లాడి వద్దును. కాని ప్రస్తుతం ప్రయాణిస్తూన్నది రైలమ్యే!

"అదిగో! అదిగో! ఆమే!" గుర్తుపట్టిననేత్రాలుఅనుమానిస్తూన్న మనస్సుకు నచ్చజెప్తూండగానే రైలు సాగిపోయింది; దృశ్యం మారిపోయింది. ప్రియసందర్శనా భాగ్యంతో మనస్సు పరవశించి సంతృప్తి జెందింది. క్షీర సాగర తనయవంటి పదహారేండ్ల పడుచు పూలచెండును గాలిలోనికి విసిరి విసిరి పట్టుకుంటూ పరుగుపెడుతున్నది, ఆల్సేషియన్ కుక్క ఒకటి ఆమెతో పోటీ పడ్తున్నది. నేత్రపర్వంగా విరిసివున్న పుష్ప వనంలో సుమబాలలలో ఒక బాలవలె శుక్లపక్షతదియనాటి నెలవంక వలె—స్నిగ్ధ క్షీరసాగర తరకవలె ధవళ వస్త్రాలలో శాంతిదూతవలెనున్న ఆ కన్య నా మనఃఫలకంపై చెరుగని ముద్రవేసింది. సందేహం లేదు. ఆమె కల్పనే! అదే రూపు, అవే చెక్కిళ్ళు, అవే విశాల నేత్రాలు శ్రుతి బిగించిన వీణలా వికసిత పద్మంలా వున్నది, మాటలకు లొంగని సౌందర్యాలు విరజిమ్ముతూ. జనకీర్ణమైన ప్రదేశాలకు

దూరంగా—పచ్చని చెట్టు చేమలతో నిండిన కొండలతో, గలగల పారే సన్నని సెలయేళ్ళతో, పచ్చిక తివాచీలతో నిండిన కొండచాళ్ళతో వున్న ఈ ప్రశాంత ఆహ్లాదకర ప్రకృతి, నావలెనే ఈమెకుకూడా ఆనందకారణం కాబోలు! అందరిచేతా పరిహాసింపబడే నాలాంటి ఏకాంత ప్రశాంత ప్రేమికులు ఇంకా వుంటారన్నమాట!

పదిరోజుల అనంతరం మళ్ళీ తిరుగు ప్రయాణ మయ్యాను. రాత్రి సమయం. పదిగంటల ప్రాంతంలో ఆ పరిసరాలను సమీపించింది రైలు. నా కండ్లు రెప్పలు వేయకుండా వెదుక్కో-సాగాయి. "ఏమిటి నాలోని ఈ మానసిక రుగ్మత! బొత్తిగా సంబంధంలేని ఒక పరాయి బాలికపై ఏమిటీ అనిర్వచనీయమైన మమత! ఆమె తలంపుతోనే బాహ్యమంతా విస్మరించే నా మనస్సును ఏమనుకోవాలి?" ఆలోచనలతో ఆత్రంగా వెదకుతున్న నా నేత్రాలకు విందుకు లోపం లేకపోయింది. విద్యుద్దీపాల కాంతులలో దేదీప్యమానంగా వెలుగొందుతూన్న బంగళా హాలులో అటూ ఇటూ పచార్లుచేస్తూ ఏదో గ్రంథం పుటలు తిరగేస్తున్నది కల్పన. నిద్ర కుపక్రమింపబోయేముందు వేషంలో గులాబిరంగు రాత్రి దుస్తులలో వున్న ఆ నిరాభరణ సుందరి ఎంత అందంగా వుంది! రైలు శబ్దం విని, పచారుఆపుజేసి, ఒక్క-

సారి విశాల నేత్రాలు పైకెత్తి చూచింది. మరునిముషంలోనే ఆమెకు రైలూ, నాకు ఆమె కను మరుగైపోయాము. ఆమెను చూడాలని ఎంత తహ తహ! ఆమెను చూచిన అనంతరం మనస్సున ఎంతటి మహదానందం! ఈ స్థితిలో ఏ చిత్రకారులైనా వుంటే అద్భుత కళాసృష్టి చేసి యుండేవారు. రచనా పటిమగల ఎవరికైనా ఇటువంటి అనుభూతి కలిగితే అనేక అమూల్య కమనీయ కావ్యాల్ని రచించి లోకంపై వెదజల్లి వుండేవారు! కాని నేను అందులో ఏ కోవకూ చెందనే!

నవనవలాడే పచ్చని శరీరం, కలువ రేఖలను బోలిన కనులు, నొక్కు నొక్కుల ముంగురులు, ఆకర్షణీయమైన విగ్రహం. ఒంటరి ప్రదేశంలో వనకన్యలా వుండే ఆ ముగ్ధ బాలకూ నాకూ యుగయుగాలనాటి సంబంధం ఏదో వున్నట్లు మనస్సు అస్పష్టంగా ఘోషిస్తూంటే పరిచయం చేసుకోవాలని అంతరంగం ఆయత్తపడుతూంటే అంతఃసంస్కారం అడ్డుపడి "తొందరపాటు కూడ"దని హెచ్చరించబోయింది. కాని నేను సరకు జేయలేదు. ఒక సుముహూర్తాన బయలుదేరి ఆమెను తనివితీరా చూచి, మనస్సువిప్పి మాట్లాడి ఆత్మీయురాలిగా అతి సన్నిహితురాలిగా చేసుకోవాలనే ధృఢ నిశ్చయాని కొచ్చాను.

విధి చిత్రమైనది. అపరిచిత అమృత భాండాలను

అయాచితంగానే దగ్గరకు తెస్తూంది; ఆశలు రేపుతుంది; అరచేత నిలిపి కవ్విస్తుంది. మనం అమాయకంగా అందుకోన బోతే అందకుండా తప్పించుకుపోయి అందలమెక్కి వూరి స్తుంది; ఆక్రోశింపజేస్తుంది. నేను నిశ్చయానికొచ్చిన కొలది రోజులలోనే అక్కడికైతే వెళ్లాను గానీ బంగళా తాళం పెట్టబడి ఉంది. ఆచూకీ అడుగుదామన్నా ఆ నిర్జన ప్రదే శంలో ఎక్కడా ఎవ్వరూ కన్పించలేదు. కల్పన ఎక్కడ ఏం జేస్తున్నదో! ఎందుకు వెళ్ళిందో? అశ్రులు చాచిన అంత రంగం అణగిపోయింది. ఆశలు అట్టడుగుకు పోయాయి. అనిర్వచనీయమైన బాధ రేగింది అంతరాంతరాలలో! నాకు ఆత్మీయమైన ఆ ప్రశాంత వాతావరణాన్ని ప్రకృతి సౌంద ర్యాన్ని అదివరలోవలె ఆస్వాదించలేకపోయాను. నీరసంగా తిరుగు ముఖం పట్టాను.

దేశం అత్యైక పరిస్థితిలో వున్నది. విమానాలు నడ పడంలో, రైఫిల్ పట్టడంలో ప్రత్యేకార్హతలుగల నా సేవను ప్రభుత్వం స్వయంగా కోరుతూ ఆజ్ఞ జారీ చేసింది. సంతో షించాలో విచారించాలో తెలియలేదు. అప్పుడే అంకురించిన రాగబీజాన్ని అయిష్టంగానే అణగద్రొక్కి, నా ముగ్ధబాలికకు వీడ్కోలు చెప్పే అవకాశంకూడ లేకపోగా-మర్నాడే డెహ రాడూన్ వెళ్ళిపోయాను, అసంతృప్తి నిండుకొన్న అంత

రంగంతో, వెనుకాడే పాదాలతో. కాని ఆ మధుర మనోజ్ఞ మూర్తి మాత్రం మనసున మాయలేదు. అందమైన ప్రకృతి దృశ్యాలను చూచినప్పుడు, సౌందర్య ప్రతిమలైన యువతులను తిలకించినప్పుడు నా ప్రేమ పాత్రమైన ఆ ప్రకృతీ, నా అభిమాన రూపిణి కల్పనా గుర్తుకొచ్చి మనస్సు కలుక్కుమనేది.

కాలగమనం ఆగలేదు. రెండు సంవత్సరాలు గడచిపోయాయి. సెలవుమీద స్వగ్రామం వెళ్ళినప్పుడు బుద్ధిపూర్వకంగానే ఆ ప్రాంతాలకు వెళ్ళాను. సాయం సమయం. ప్రశాంత మనోహర వాతావరణం. కారు కొద్ది దూరంలో ఆపి కాలినడకను బంగళాను సమీపించాను. ఎదలో సుందర హర్మ్యాలు నిర్మించుకుంటూ, బంగళా అరుగు పైననే నిల్చుని వున్నది ఆ అజంతా శిల్పసుందరి. "ఏమి నా అదృష్టం! లోపలికి వెళ్దునా, మానుదునా?" అనే మీమాంసతో అనతిదూరంలో ఆగిపోయాను.

"ఏం చెప్పాలి? దూరపు బంధువుననా? నా ఈ అయాచిక పరిచయాలను వారు అంగీకరిస్తారా?" ఆలోచిస్తూనే అక్కడ నిలిచాను.

ఏదో పూదీవెను స్తంభంచుట్టూ చుట్టడానికి తాపత్రయపడుతూన్న ఆమెను పరీక్షగా చూశాను. అప్పటికీ

ఇప్పటికీ కొంచెం లావెక్కింది. అందం ఇనుమడించింది. తలంటుకున్నదేమో — పొడవైన నొక్కుల జుట్టు ఉంగ రాలుగా తిరిగి నుదుటిపై, భుజాలపై అందంగా పడి ఆడు కుంటున్నది. లేత ఆకుపచ్చని దుస్తులతో, ముత్యాల నగ లతో — ఎర్రగా కాగిన క్షీరంవంటి మేనుఛాయతో, కాటుక తీర్చిన కలువ కన్నులతో దివినుండి భువికి దిగిన దేవతలాగా వున్న ఆమెను తన్మయమై చూస్తూ వచ్చిన పనే మరచిపోయాను. అలా ఎంతసేపు గడిచిందో నాకే తెలియదు. నా కనులముందున్న దృశ్యంలో మరో వ్యక్తి ప్రవేశించేవరకూ, బంగళా లోపలినుంచి స్ఫురద్రూపి అయిన ఒక ముప్ఫై ఏళ్ళ యువకుడు బయటకు వచ్చి ఆమె సరసన నిలుచున్నాడు. ఆమె చేస్తున్న పనిని ఆపుజేసి అతడివైపు దరహాస దృష్టులు బరపింది. సమాధానంగా అతడి మోమంతా మందహాసం ఆవరించింది. ప్రక్క కుండీలో విరబూచిన గులాబిని త్రుంచి సున్నితంగా ఆమె చెవిప్రక్క కురులలో తురిమాడు. ఇద్దరూ చిరునగవులు చిందే మోము లతో సల్లాపాలతో పోయి పూదీవెలమధ్య తిన్నెపై కూర్చుని మాట్లాడుకోసాగారు. "ఓ! ఆమెకు వివాహ మైనట్లుంది! అతడెంత అదృష్టవంతుడు! ఆమె అనురాగాన్ని అందుకొని అందాన్ని ఆస్వాదించి, మనస్సును ఆవరించి,

స్నేహాన్ని పంచుకొని, ప్రేమను పొంది ఆనందించగల అదృష్టమూర్తి!"

అనురాగాను బంధాలను వదలి, అసూయా అసంతృప్తులను నింపుకొన్న అంతరంగంతో తిరిగి పోయాను. ఆ తోటకు, బంగళాకూ, పరిసరాలకూ కూడా వన్నెదెచ్చి నిండుదనం చేకూర్చిన ఆ జంటను చూచి మనసారా ఆనందించలేక పోయాను. అంతకుముందు నాకు ఒరిగిన వైకుంఠమేమిటో — ఇప్పుడు జరిగిన అపకారమేమిటో తెలియదు కాని, ఈసారి ప్రియబాంధవి దర్శనం నాకు ఆనందదాయకం కాలేదు. గృహస్థాశ్రమంలోవున్న ఆమెను చూచి నాకు తెలియకనే నా హృదయం ఏడ్చింది. ఇదివరలో ఏ మూలనో అణగి పడివుండే కల్పన ఇప్పుడు నా యావత్ హృదయాన్ని ఆవరించేసి అనుక్షణం వెంటాడసాగింది. హృదయ శల్యంవంటి ఆ బాధను భరించడమేకాని పిరికివారికీ నిరుపాయులకూ అంతకంటె ఉపాయమేమున్నది?

కాలచక్రం పరిభ్రమిస్తూనే వున్నది. మానవమాత్రులతో మమతలతో, ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే దశవత్సరకాలం గడచిపోయింది. ఈసారి ఒక మిత్రుని వివాహ సందర్భంలో తిరిగి ఆ ప్రాంతాలకు వెళ్ళక తప్పలేదు. కాని ఆ ప్రదేశానికి మాత్రం ఎంత వెళ్ళవద్దను

కున్నా మనసులో ఆత్రతను ఆప శక్యం కాలేదు. అనేక స్మృతులు అతి నూతనమైనట్లు మేల్కొనగా, ఏదో అనిర్వచనీయానుబంధం పురికొల్పగా, కల్పన ఇప్పుడెలా వున్నదో, ఏం చేస్తున్నదో చూడాలనే ఉత్సుకత అధికం కాగా ఆ చోటికి బయలుదేరాను. నా మిత్రుడుకూడా నన్ననుసరించాడు కాలక్షేపానికి.

"ఓ! వారు మాకు స్నేహితులే! రా వెళ్దాం లోపలికి" అంటూ లోపలికి దారితీశాడు. సందేహిస్తూన్న నన్ను చూచి.

మౌనంగా అనుసరిస్తూన్న నేను అతి ఆశ్చర్యంతో చేష్టలు దక్కి నిలబడిపోయాను. అతి ఆశ్చర్యం — మహాశ్చర్యం! పదహారేళ్ళనాటి దృశ్యం తిరిగి తు. చ. తప్పకుండా కన్పించింది! మొదటిసారిగా నేను చూచిన బాలిక కల్పనే ఏ మార్పులూ పొందకుండా ఏ అమృత సిద్ధివల్లనో అలాగనే వుండిపోయిందా అన్నట్లుంది! పదేళ్ళ బాలిక — అదే రూపు! అవే అరుణ వర్ణపు దుస్తులు! అలాగే బంతితో ఆట! నయనానందకరంగా ఆ పుష్పవనం మధ్య స్వేచ్ఛగా పరుగులిడుతున్నది! అంతలో లోపలనుంచి "కల్పనా" అంటూ ఓ ముప్పై ఏళ్ళ యువతి వచ్చి ద్వారంలో నిలబడింది. నేను ఆనందంతో, ఆశ్చర్యంతో తిలకిస్తూ అలాగే

నిల్చున్నాను. ఏమాత్రం సందేహం లేదు. సౌందర్యం అను మాత్రమైనా తరగలేదు. ఆమె కల్పనే! కాని కుమార్తె పేరుకూడా కల్పనేనా? వింతగా లేదూ? యౌవనంలోనే అణగ ద్రొక్కిన జిజ్ఞాసను ఇవాళ అరికట్టలేకపోయాను. మమ్మల్ని చూచిన ఆ యువతి లోనికి వెళ్ళిపోయింది. చిన్నారి కల్పన మా దగ్గరకు పరుగులెడుతూ వచ్చి నిల్చుని "ఎవరు కావాలండీ?" అని అడిగింది. ముద్దులు మూట గడ్తూన్న ఆమెను చేతులలోనికి తీసుకుంటూ "నాన్న గారు ఇంట్లో ఉన్నారమ్మా" అనడిగాడు నా స్నేహితుడు.

"ఉన్నారు, రండి" లోనికి ఒక్క పరుగు తీసింది.

హాల్లో ఓ ముప్పై-ముప్పై అయిదేళ్ళతడు కూర్చుని పేపరు చూచుకుంటున్నాడు. "రండి రండి" అన్నాడు మమ్మల్నిచూచి మర్యాదగా లేచి నిలబడి.

పరిచయాలు అయ్యాయి: అతడిక్కడ బ్లాక్ డెవలప్ మెంటు ఆఫీసరట; వచ్చి రెండు సంవత్సరాలే అయ్యిందట! "కల్పనా! కాఫీ తేమ్మా! కళ్యాణీ కాఫీ పంపించు!" అంటూ లోనికి కేక పెట్టాడు. నా ఆశ్చర్యానికి అవధులు లేక పోయాయి.

"ఈ బంగళా కట్టిన కొత్తలో ఇందులో వుండే

వారమ్మాయి పేరుకూడా కల్పనే? మీకు తెలుసా? మీ అమ్మాయిలాగే వుండేది అచ్చంగా" అనడిగాను.

అతడదో మాదిరిగా చూచి, "నే నెరుగను, నాకీ ప్రాంతమే క్రొత్త. వారు మీ బంధువు లనుకుంటాను." అన్నాడు.

"అవు" నని అప్రయత్నంగా అబద్ధమాడాను.

"ఇక్కడ తోటమాలి చాల ఏళ్ళుగా పనిజేస్తున్న వాడే, అతడి నడగండి వివరాలు అవసరమయితే."

తోటమాలిని మా ఎదుటకు పిలచి ఆ ఆఫీసర్ లోపలికి వెళ్ళిపోయాడు.

ఆ ఇల్లు కట్టడం మొదలు పెట్టినప్పటినుంచి తా నక్కడే పని జేస్తున్నాననీ, ఏ ఆచూకీ కావలసినా చెప్తాననీ సవినయంగా అన్నాడు ముసలి తోటమాలి.

అడిగాను.

అతడు క్షణకాలం నిర్ఘాంతపోయాడు. కనులలో నీటి పొరలు! నన్ను ఎగాదిగా చూచాడు.

"ఆరు మీ కేమవుతారు" అనడిగాడు. ఆ మాట లలో ఎక్కడో సానుభూతీ, జాలీ ధ్వనిస్తున్నాయి.

"దూరపు బంధువులు, స్నేహితులు," తప్పనిసరిగా అన్నాను.

అతడు వచ్చీ రాని కన్నీరు తుడుచుకున్నాడు. "ఒక ఆఫీసర్ గారు రిటైరైపోయి మనుమరాలితో ఇక్కడ వొచ్చి ఇల్లు కట్టుకొన్నాడు. అప్పుడు ఏమని చెప్పను? ఆ కొద్ది నాళ్ళకే ఆ చిట్టి తల్లి కల్పన పాము కరచి చనిపోయింది. తాతగారుకూడా ఏడాది తిరగక ముందే "ఫ్లూ" జ్వరంతో చచ్చిపోయారు."

నా శరీరం పట్లు తప్పిపోయింది !

అతడింకా చెప్పుకు పోతున్నాడు. "వారి కెవరూ లేరిక. వారసు లెవరో ఒక ఆయన, ఆయన కూతురూ వచ్చివున్నారు కొంత కాలం పల్లెపట్టునుందామని. ఆ కూతురికీ పెళ్లయిపోయి ఆరు ఢిల్లీ ఎల్లిపోయారు. కొన్నాళ్లు కొంప దిక్కూ దివాణం లేక ఏడిసింది. ఆనక ఒక డాక్టరు బాబూ, ఆయన భార్య వచ్చి నాలుగేళ్లున్నారు. ఇక్కడ సరిపడక ఆరు ఎల్లిపోయారు. తిరిగి ఈ బాబుగా రొచ్చిన్రు. కల్పన చాలా అందంగా వుండేది. మళ్ళీ ఈ కల్పనా బాగానే వుంటది. ఈ బిడ్డను చూడగానే నాకు ఆ తల్లే గుర్తుకొచ్చింది. "తాతా" అని దగ్గరకు జేరేది చిట్టి తల్లి!" అంటూ దుఃఖం ఆపుకొన లేకపోయాడు ముసలి తోటమాలి.

అప్పటినుంచి ఇప్పటివరకూ నా సందేహాలు అలానే

వుండిపోయాయి. అనుదినం కల్పన గుర్తు వస్తుంది. బాధ నిత్య నూతనమై రేగుతుంది.

"కల్పన ఆ లేత వయసులోనే చనిపోయింది కదూ— మరి ఈ గొలుసుకట్టంతా ఏమిటంటావు? ఆ నలుగురి రూపు రేఖలూ ఒకే విధంగా వుండడం చిత్రంగా లేదూ?" అని నా అజ్ఞానం అంతరంగాన్ని ప్రశ్నిస్తుంది.

వివేకం సమాధాన మిస్తుంది: "అవే మనకు అర్థం కాని భగవంతుని మాయావిశేషాలు. ఈ మానసిక రోగి శాంతి రహిత హృదయంలోని భావకల్పనకు దయతో ఆ ప్రేమ స్వరూపు డిచ్చిన కల్పన!" అని.